క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : వెలమ కమ్యూనిటీ హాలు మంజూరు చేయడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వెలమ సంఘం ఆధ్వర్యంలో శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కమ్యూనిటీ హాలు మంజూరీ పట్ల హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత దయాకర్‌రావును నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, మాజీ సర్పంచ్ పానుగోటి భాస్కర్‌రావు, వెలమ సంఘం అధ్యక్షుడు అన్నమనేని రంగారావు, డైరక్టర్లు పసుపుల్ల రఘురావు, సుంచికాల రాముదావు, గుజ్జ యాదగిరిరావు, సూరినేని దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సోల్తి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రవికుమార్‌కు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ సోల్తి సారయ్య శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో రవికుమార్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మల్లేశంలకు కృతజ్ఞతలు తెలిపారు.

సొంతూరి ప్రజలకు అండగా ఉంటా



రాయపర్తి : తన సొంత ఊరి ప్రజలకు అండగా ఉంటానని ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్, ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. తన స్వగ్రామమైన మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చిర్ర ఈరమ్మ డెంగ్యూతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటుండగా బాధిత కుటుంబానికి శ్రీనివాస్‌రెడ్డి శనివారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత ఈరమ్మను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లేతాకుల మహేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, సురేందర్‌రెడ్డి, కోల సంపత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన ఆర్టీసీ డిపో మెకానిక్ మల్యాల రవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎఫ్ విజయకుమార్, ఎల్‌హెచ్ గోపాల్‌రెడ్డి, ఉద్యోగులు ధనుంజయ్, రత్నాకర్, కుమార్, వెంకన్న, సూపర్‌వైజర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని సన్నూరుకు చెందిన ఇంటర్ విద్యార్థి పోతుల కార్తీక్ ఆత్మహత్య చేసుకోగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం నివాళులర్పించారు. అనంతరం కార్తీక్ తండ్రి అయిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమురుముల్లును పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గాయాలపాలై వృద్ధురాలి మృతి

నెక్కొండ : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు అకస్మాత్తుగా కింద పడి గాయాలపాలై రక్తస్రావంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెంగకు చెందిన గుగులోతు జునా (76) కేసముద్రంలోని కూతురు ఇంటికి వెళ్లి తిరిగి నెక్కొండకు చేరుకుని నడిచి వెళ్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలింది. స్థానికులు మంచినీరు తాగించి సపర్యలు చేసినప్పటికీ రక్తంస్రావం కావడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని పర్వతగిరి శివారు దేవీలాల్‌తండా వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని బూరుగుమడ్ల శివారు చింతకుంటతండాకు చెందిన మాలోతు విజేందర్ ద్విచక్ర వాహనంపై వరంగల్ వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న సిమెంటు కుర్చీలకు ఢీకొంది. దీంతో విజేందర్ తల, కాలుకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

వర్ధన్నపేట : విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శనివారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. స్కాలర్‌షిప్ విడుదల కాక లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే, వేలాది మంది లెక్చరర్లకు ఉపాధి ఇస్తున్న కళాశాలలు మూతపడే ప్రమాదం నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. తదనంతరం తహసీల్దార్ విజయసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ, అజీర, అఖిల, ఐశ్వర్య, సుస్మిత, రాజు సాగర్, తనీష్, సంతోష్, చందు, రామ్ చరణ్, రత్నాకర్, నాగరాజు, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని గెస్ట్‌హౌజ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యార ప్రశాంత్ మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యార ప్రశాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా గత ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. తొలుత కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి అనిల్, జిల్లా కమిటీ సభ్యుడు కార్తీక్, నాయకులు చందు, మల్లికార్జున్, కృష్ణకుమార్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

మునగాకుతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగు



పప్పులో మునగాకు వేస్తున్న ఎంఈఓ, ఏపీఎం

చెన్నారావుపేట : ఆహారంలో మునగాకు తీసుకుంటే విద్యార్థుల ఆరోగ్యం మెరుగవుతుందని ఎంఈఓ సరళ, ఏపీఎం ఈశ్వర్ తెలిపారు. మండలంలోని జల్లి గ్రామంలోని ప్రభుత్వ స్కూల్‌లో శనివారం మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన మునగాక పప్పు కూర వండి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సరళ, ఏపీఎం ఈశ్వర్ మాట్లాడారు. మునగాకులో పోషకాలు భారీగా ఉన్నాయని చెప్పారు. మునగాకుతో వండిన కూరలు భోజనంలో తీసుకుంటే విద్యార్థులు శారీరకంగా బలోపేతమవుతారని తెలిపారు. రక్తహీనత తగ్గుతుందని వివరించారు. వారానికి రెండు సార్లు మునగాకుతో కూరలు వండి విద్యార్థులకు వడ్డించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీసీలు మంజుల, శ్రీలత, మాణిక్యం, సుజాత, వీఓఏలు రమేశ్, లత, రమ, ఆమని, స్వరూప, అనిత, కుమారస్వామి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రణయ్, వేణ్కుఉమార్, భరత్‌నాయక్, నాగరాజులను విద్యాలయ ఆవరణలో శనివారం ప్రిన్సిపాల్ అభినందించి మాట్లాడారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో వరంగల్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రణయ్, వేణుకుమార్, భరత్, నాగరాజు రన్నింగ్, లాంగ్‌జంప్‌ల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ఏటీపీ మానస, డిప్యూటీ వార్డెన్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత కీలకం

సంగెం : మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం కీలకమని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పరిశీలన సందర్భంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదని నిర్ధారించి ఏజెన్సీ మార్పునకు కలెక్టర్ ఆదేశించడంతో ఆ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించి ఏజెన్సీని మార్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. రుద్రమదేవి గ్రామైక్య సంఘం సభ్యులైన సదిరం శిరీశ, సదిరం గాయత్రిలకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ అప్పగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాము, హెచ్‌ఎం శోభారాణి, డీపీఎం సరిత, ఏపీఎం కిషన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మమత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్

టఫ్ అధ్యక్షుడిగా పవన్



నల్లబెల్లి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) నర్సంపేట డివిజన్ అధ్యక్షుడిగా బొట్ల పవన్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో పవన్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను సంఘటితం చేస్తూ ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేసి ఉద్యమకారులకు అండగా నిలవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తన నియామకానికి కృషి చేసి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. త్వరలో కుల గణన జరిగి స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అంతకు ముందే జిల్లా పేరుతే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర గీత కార్పొరేషన్‌కు చైర్మన్ను, పాలక మండలిని నియమించడంతోపాటు కార్పొరేషన్ నిర్వహణకు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, గీత కార్మికులకు చెల్లించాల్సిన బీసీ కార్పొరేషన్ బకాయిలు, ఎక్సైజ్ శాఖ ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని, వృత్తిలో మృతి చెందిన గీత కార్మికులకు రూ.10 లక్షలు, శాశ్వత వైకల్యం పాలైన వారికి వారికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జూలూరి హరిప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె మల్లేశం, జిల్లా ప్రచార కార్యదర్శి జూనూరి నరేశ్, యువజన సంఘం డివిజన్ కార్యదర్శి నాంపల్లి వెంకట్, ఖానాపురం, చెన్నారావుపేట మండలాల అధ్యక్షులు గొడిశాల మల్లయ్య, మేరుగు గంగాధర్, కమలాపురం గౌడ సంఘం అధ్యక్షుడు గాదెగోని వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శాఖ కార్యదర్శిగా మధుకర్



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా పరికి మధుకర్‌ను ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండల కార్యదర్శి నమిండ్ల స్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మధూకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం స్వామి మాట్లాడారు. పార్టీకి, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి మధూకర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం మధూకర్ మాట్లాడారు. పార్టీ బలోపేతం, ప్రజాసమస్యల పరిష్కార దిశగా పోరాటాల నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రభుత్వ తీరుతో పంటల సాగు నిర్వీర్యం'

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పంటల సాగు, వ్యవసాయ రంగం నిర్వీర్యమతున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. గీసుకొండ మండలంలోని కొనాయిమాకులలో బరుపాటి రవీందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సుమారు 75 శాతం జనాభాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగం రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలతో సంక్షోభంలో కూరుకుపోతోందని తెలిపారు. సాంకేతిక, నాగరిక విలువలకు అనుగుణంగా వ్యవసాయ రంగానికి ప్రణాళికలు రూపొందించకపోవడంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నష్టాలపాలై మూతపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం నగదు పంపిణీ, ఉచితాలతో మభ్య పెడుతూ సమస్యను మరుగున పడేస్తోందని వివరించారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగ బలోపేతానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఊరటి అంకాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా కమిటీ సభ్యులు మోకిడి పేరయ్య, నాయకులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలోని పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేసి రూ.3,560 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో కొందరు పేకాడుతున్నారన్న సమాచారం అందడంతో దాడి చేసి గొడిశాల కాంతయ్య, అంగోతు వెంకన్న, బత్తుల కుమార్, దండు వేణులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

'అంబేడ్కర్ అభయహస్తం' హామీ నెరవేర్చాలి

సంగెం : దళిత బంధుకు ప్రత్యామ్నాయంగా అంబేడ్కర్ అభయహస్తం పేరుతో దళిత పేద కుటుంబాలకు రూ.12 లక్షలు చొప్పున అందజేస్తామన్న ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడారు. అంబేడ్కర్ అభయహస్తం, తదితర అనేక హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. దళితుల సహకారంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నమిండ్ల క్లెమైంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ముల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కొంగర స్వామి, గీసుకొండ మండల అధ్యక్షుడు బరిగెల యాకూబ్, యువసేన జిల్లా అధ్యక్షుడు కేదాసి ప్రేమ్‌సాగర్, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ముల సురేశ్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

నర్సంపేట : పట్టణంలో మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి దంపతుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేసింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. పట్టణంలోని అంగడి సెంటర్ సమీపంలోని సెంట్రల్ బ్యాంకు ఎదుట కొన్నేళ్లగా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి దంపతుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ బ్యాంకు ఎదుట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందగిరి రజనీకాంత్, బేతి విశ్వబంధు, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యాంకుమార్ యాదవ్, గట్టు ఆనంద్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, వోడపెల్లి రమేశ్, మర్రి క్రాంతికుమార్, గోపగాని నాగరాజు, శిరంశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

నల్లబెల్లి : భూరిజిస్ట్రేషన్‌లో అవసరం లేని ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న తహసీల్దార్ కృష్ణపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఒల్లె పర్వతాలు, రమేశ్, ఓదెల రవి తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాదానికి బీజేపీ కుట్ర'

నల్లబెల్లి : బీజేపీ మతోన్మాదానికి కుట్ర చేస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు భూక్య సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను విస్మరిస్తోందని తెలిపారు. అనంతరం శాఖ కార్యదర్శిగా బొడిగె సమ్మయ్యను ఎన్నుకున్నారు. సభలో నాయకులు వీరాచారి, మనోహర్, క్రాంతి కుమార్, నారాయణ, సారయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- పరిహారం చెక్కు అందజేత

నర్సంపేట : అప్రమత్తంగా ఉండడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించొచ్చని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఖానాపురం మండలంలోని కొడ్తిమాటుతండాకు చెందిన భానోతు చందర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా మంజూరైన రూ.5 లక్షల పరిహారం చెక్కును చందర్ సతీమణి అచ్చమ్మకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరెడ్డి శనివారం అందజేసి మాట్లాడారు. వ్యవసాయదారులు, గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నా, ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. చందర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా ప్రభుత్వ, ఉన్నతాధికారుల సహకారంలో పరిహారం మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ తిరుపతి, ఏడీఈ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



అచ్చమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈ

గ్రామీణులకు మెరుగైన వైద్యమే ధ్యేయం



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే పల్లె దవాఖానాల ధ్యేయమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ సరోజ తెలిపారు. మండలంలోని కోనాపురంలోని పల్లె దవాఖానను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, దవాఖానా పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పల్లె దవావాఖానాను ప్రజలు వినియోగించుకునేలా ఆశవర్కర్లు, ఏఎస్‌ఎంలు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడిన ప్రజలు ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పల్లె దవాఖానాల్లోనే అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. మెరుగైన సేవలు అందించిస్తేనే ప్రజలు పల్లె దవాఖానకు వస్తారని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే వారికి భరోసా కల్పించేలా వైద్యులు, సిబ్బంది పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ దయాకుమారి, సూపర్‌వైజర్ సువార్త, ఏఎస్‌ఎం శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి



చెన్నారావుపేట : సర్టిఫికెట్లు పొందిన నీటి సహాయకులతో ఎంపీడీఓ, తదితరులు

చెన్నారావుపేట : ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఎంపీడీఓ శ్రీవాణి ఆకాంక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. సింగిల్ ఫేజ్, 3జీ మోటార్లు, ప్యానల్ బోర్డ్, ఎలక్ట్రికల్ (విద్యుత్) పరికరాల మరమ్మతు, నిర్వాహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేస్తూ ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని సూచించారు. నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. అనంతరం నీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సబ్ డివిజన్ ఇంట్రా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రణధీర్, గ్రిడ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.



దుగ్గొండి : శిక్షణ ఇస్తున్న టెక్నీషియన్

దుగ్గొండి : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ మంచినీటి సరఫరా కార్యక్రమంలో భాగంగా పైపులైన్ల రిపేర్, ట్యాంక్‌ల పర్యవేక్షణ, శుభ్రత, చేతిపంపుల రిపేరుపై శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా జీపీ సిబ్బందికి చేతిపంపు మరమ్మతు విధానాన్ని టెక్నీషియన్ సుజిత్ వివరించారు. అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఈ మంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జెండర్ కమిటీల ఏర్పాటు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై ప్రవీణ్, తదితరులు

పర్వతగిరి : సమాన పనికి సమాన వేతనం అందించే ఉద్దేశ్యంతో చేపడుతున్న కార్యక్రమాలు సజావుగా సాగేలా గ్రామాల్లో పీయూ స్థాయిలో జెండర్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో పీయూ మేనేజర్ చింతం హిమవర్షిణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశానికి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. హెచ్ అండ్ ఎం ప్రాజెక్టులో భాగంగా రైతుల ప్రాజెక్టు అమలు చేస్తున్న బీసీఐ, హెచ్‌అండ్ ఎం రైతులపాటు వ్యవసాయ కూలీలను పని ప్రదేశంలో గౌరవప్రదంగా చూడాలని సూచించారు. జెండర్ కమిటీ అధ్యక్షురాలిగా ఎం.బానమ్మ, ఉపాధ్యక్షురాలిగా వి.స్రవంతి, కార్యదర్శిగా పి.శంకర్, ముఖ్య సలహాదారుగా హారతిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా సమాజంలోని ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. అనంతరం బాల కార్మిక నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజ్వల్ రైతు సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రకాశ్‌రావు, పాలకవర్గ సభ్యురాలు రాధిక, ప్రాజెక్టు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల చెరువును పరిరక్షిస్తాం

రాయపర్తి : మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువును పరిరక్షిస్తామని గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. సదరు చెరువులో సమీపంలోని సత్యనారాయణస్వామి పౌల్ట్రీ హ్యాచరీస్ నుంచి వ్యర్థాలు కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోందంటూ గ్రామ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం చెరువు నీటిని వివిధ శాఖల అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు రిపోర్ట్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ పరిరక్షణ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. సత్యనారాయణ స్వామి పౌల్ట్రీ హ్యాచరీస్ నుంచి వ్యర్థాలు చేరుతుండడంతో చెరువు నీరు కలుషితమవుతున్న క్రమంలో పరిరక్షణ కోసం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రిపోర్ట్‌ను అధ్యయనం చేసి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు రావుల భాస్కర్‌రావు, పరమేశ్వర్, వెంకట్, సుధాకర్, దీకుంట్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



రిపోర్ట్ తీసుకుంటున్న భాస్కర్‌రావు, తదితరులు